www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 13 మే 2025
5
అన్నమయ్య

విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవికి విఆర్‌ఎలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని మదనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో విఆర్‌ఎలకు పదోన్నతులు కల్పించి వాచ్‌మెన్, అటెండర్లుగా అవకాశం కల్పించారని అన్నారు. రాజంపేట రెవెన్యూ పరిధిలోని విఆర్‌ఎలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. విఆర్ ఎలకు అత్యధిక శాతం ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ సామాజిక వర్గానికి చెందినవారని, వారు చేసిన సేవలు గుర్తించి విద్యార్హతలు బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మణి, విఆర్ఏ సంఘం నాయకులు సుధాకర్, మధు, లక్ష్మీకర్, సుండుపల్లి బాషా, నందూరు పెంచలయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్ల అసంబద్ధతలను తొలగించాలి

- నిరసనలో యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబీర్ పేర్కొన్నారు. సోమవారం సమస్యల పరిష్కారం కోసం జిల్లా డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో ప్రతి వారం విద్యాశాఖ అధికారులు సమావేశమై చర్చిస్తున్నప్పటికీ ఉపాధ్యాయులలో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన సమస్యలపై విద్యాశాఖాధికారులు స్పందించకుండా, ఏకపక్షంగా చేపడుతున్న చర్యల వల్ల విద్యారంగం నష్టపోతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 3, 4, 5వ తరగతుల విలీనం, జిఒ 117 పేరుతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలు చేపట్టిందని తెలిపారు. ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందన్నారు. 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి తరలి పోయారని తెలిపారు. జిఒ 117 రద్దు చేస్తామని ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణించడం విచారకరమని విమర్శించారు. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయులను కేటాయించిన విధంగా బేసిక్ ప్రైమరీ పాఠశాలలో కూడా తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలను లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ మాట్లాడుతూ కొత్తగా 779 హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేయడం, 9652 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయడం హర్షణీయమని, హైస్కూళ్లలో 54 మంది విద్యార్థులు ఉంటేనే 2వ సెక్షన్ కేటాయిస్తామని వైఖరి తీసుకోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లీష్ సర్ ప్లస్ అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ వైఖరి విద్యారంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తుందని, ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థులు ఉంటే 2వ సెక్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తున్న ప్రభుత్వ మొండి వైఖరిని మార్చుకోవాలని, ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలవరకు సమాంతర మీడియాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల పునఃవ్యవస్థీకరణకు సంబంధించి అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించి, ఉర్దూ, మైనర్ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్‌జిటి, ఎస్ఎతో కలిపి లెక్కించి పోస్టులు కేటాయించడం సరికాదు అని ఆ పోస్టులు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి, హైస్కూల్లో విద్యార్థుల సంఖ్య 300 దాటిన చోట రెండవ పీడీ పోస్టు కేటాయించాలన్నారు. బదిలీలకు సంబంధించిన సమస్యలు స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) టీచర్లకు బదిలీల్లో కొత్తగా మంజూరు చేసిన పోస్టులు ఖాళీలుగా చూపాలన్నారు. ప్లస్ టూ హైస్కూల్స్‌లో ఖాళీగా ఉన్న పిజిటి పోస్టులు అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లతో ముందుగా భర్తీ చేసిన తర్వాతనే స్కూల్ అసిస్టెంట్ బదిలీలు చేపట్టాలన్నారు. 2021 తర్వాత వరుసగా రెండు సార్లు రేషనలైజేషన్కు గురైన ఉపాధ్యాయులకు అదనపు పాయింట్లు ఇవ్వాలన్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉపాధ్యాయులను 50 శాతం భర్తీ చేయాలనే నిబంధన కేటగిరీ 1, 2ం పాఠశాలలకు మాత్రమే వర్తింప చేసి, 610లో వచ్చిన ఉపాధ్యాయుల సీనియారిటీకి రక్షణ కల్పించాలన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో అప్‌గ్రేడేషన్ ప్రక్రియ సత్వరమే చేపట్టి ప్రమోషన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరి, డిఇఒ కార్యాలయ పర్యవేక్షకులు రవి కుమార్‌కి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎస్ శివారెడ్డి, జిల్లా కోశాధికారి బి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, దావుద్దీన్, రమణ మూర్తి, వెంకట సుబ్బయ్య, పురం వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిలర్ డి.చెంగల రాజు, ప్రచురణ విభాగం కన్వీనర్ విజయ్ కుమార్, సిపియస్ కన్వీనర్ అంజాద్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సబ్ కమిటీ కన్వీనర్ సాదిఖ్ ఖాన్, వివిధ మండలాల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్తు సరఫరాయే లక్ష్యం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ఆర్‌డిఎస్ స్కీం ద్వారా గ్రామాల్లో 24 గంటలూ మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి, కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి ఆర్‌డిఎస్ స్కీంపై ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలలో అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ప్రతి గ్రామానికి ఆర్‌డిఎస్ స్కీం ద్వారా త్రీఫేస్ కనెక్షన్ ఇచ్చి 24 గంటలు మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో జరుగుతున్న ఆర్డిఎస్ స్కీం వేగవంతం చేసి త్వరితన పూర్తి చేయాలని మంత్రి సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ స్కీం నిర్వహణలో ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. ఆర్‌డిఎస్ స్కీం అమలు చేయడం వల్ల గ్రామాలలో చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. గ్రామాలకు త్రీఫేస్ సప్లై ఇవ్వడం వల్ల ఎర్త్ సమస్యలు రాకుండా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చునన్నారు. గతంలో ప్రజలు లో వోల్టేజ్ సమస్య వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ఇక నుంచి లో వోల్టేజ్ సమస్య ఉండదన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ఆర్‌డిఎస్ స్కీం ద్వారా మారుమూల గ్రామాలలో సైతం చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు పొందవచ్చునన్నారు. ఈ స్కీం ప్రోగ్రెస్ పెంచి త్వరగా పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇందులో భూ సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. కరెంటు పోల్లు వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందికరంగా లేకుండా నాటించాలన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేయకుండా ఆర్‌డిఎస్ స్కీంను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇకనుంచి ప్రతి గ్రామంలో త్రీఫేస్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి 24 గంటలు గ్రామాలకు మెరుగైన విద్యుత్తు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఇఇ కన్స్ట్రక్షన్ శ్రీనివాసరెడ్డి, పవర్ గ్రిడ్ డిజిఎం కిరణ్, రాజంపేట, మదనపల్లె, ఇఇలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి

కలెక్టర్ కార్యాలయంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమావేశం పూర్తయిన తర్వాత జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జులను స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితులు సమర్పించిన ఆర్జీలను మంత్రి ఓపికగా విని వాటి పరిష్కారానికి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజలు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వార్డు సమస్యలకు సత్వర పరిష్కారం : ఎమ్మెల్యే

వార్డు పర్యటనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. సోమవారం వార్డుబాటలో భాగంగా పట్టణంలోని కుమారపురం, గాంధీపురంలో అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల్లో మురుగునీటి కాలువలు, వీధిలైట్లు, తాగునీటి సరఫరా ఇతర మౌలిక సదుపాయాలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీల ద్వారా వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని తద్వారా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. వార్డుల్లో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు మాజీ కౌన్సిలర్ తలారి రాధమ్మ దంపతులు పూలమాల, శాలువాతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్ ఖాన్, జంగాల వెంకటరమణ, జెసిబి మధుసూదన్ రెడ్డి, రైస్ మిల్ శశి కుమార్, జీవి నాయుడు, ఎమ్మార్పీఎస్ ఆరేటి వాసు, పూలకుంట్ల హరిబాబు, నాయి బ్రాహ్మణ నాయకులు మంజునాథ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను మరియు ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ స్నాక్స్, వాటర్ బాటిల్, టి సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎస్‌డిసి రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కళాజాతా బృందాలతో ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో కళాజాత ద్వారా ఎయిడ్స్, లెప్రసీ, టీబి పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణలో భాగంగా కళాజాత బృందాలు ఈ నెల 31వ తేదీ వరకు వివిధ ప్రదేశాలలో కళాజాత బృందం హెచ్‌ఐవి/ఎయిడ్స్ వ్యాధి పైన, రక్తదానం సుఖ వ్యాధుల పై వీధి నాటకాలు ద్వారా ప్రజలకు అవగాహన నిర్వహించడం జరుగుతుందని హెచ్‌ఐవి ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాప్తి చెందుతుంది, హెచ్‌ఐవి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, దానికి ఎలాంటి చికిత్స అవసరం, కండోమ్ యొక్క ఉపయోగాలు, క్షయ వ్యాధి గురించి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా సమాజంలో ఏ విధంగా జీవించాలి అనేదానిపై ప్రజలకు అవగాహన కోసం కళాజాత నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాజాత సిబ్బంది, జిల్లా వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి

వైభవంగా భువనగిరి నరసింహస్వామి బ్రహోత్సవాలు

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే 'ఆకేపాటి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని భువనగిరిపల్లి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తండోపతండాలుగా విచ్చేస్తున్న ప్రజలకు అసౌకర్యం కలగకుండా ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి అన్నదానాలు, మంచినీరు వంటి విస్తృత ఏర్పాట్లు చేశారు. మూడవ రోజు శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు వారిని మేళ తాళాలతో ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ స్వామివారి కృపా, కటాక్షాలతో నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సమయానికి వానలు గురించి ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ మర్రిరవికుమార్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, ఊటుకూరు ఎంపిటిసి నాగచంద్రశేఖర్‌రెడ్డి, శ్రీను, ఆలయ ధర్మకర్తలు కెఎస్.నరసింహ, పూల హరిప్రసాద్, కావేరి గారి వెంకటరమణ, నామాల రాజశేఖర్, మన్నేరు లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

బాధితులకు వెంటనే న్యాయం చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదుదారుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలు సేకరించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి కుటుంబ కలహాలు సైబర్ మోసాలు తల్లిదండ్రులకు వేధింపులు భర్త అత్తారింటి వేధింపులు భూ ఆస్తి వివాదాలు నకిలీ పత్రాలు అధిక వడ్డీలు ఆన్లైన్ మోసం ప్రేమ పేరుతో మోసం ఇతర సమస్యలపై అర్జీలు స్వీకరించామని, వారి సమస్యలపై సంబంధిత పోలీస్ అధికారులతో స్వయంగా చరవాణి ద్వారా మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని బాధితులకు చట్టపరిధిలో తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకొని తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు.

15న వాహనాల వేలం పాట

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాలకు సంబందించిన వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు ఈ నెల 15వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ హిమబిందు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు గురువారం ఉదయం 10 గంటలకు డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్, జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో రాయచోటి ఎక్సైజ్ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా ఎక్సైజ్ కార్యాలయంలో రూ.5 వేలు దారవత్తు నగదును టోకెన్‌గా చెల్లించాలని తెలిపారు. వేలంలో వాహనాలు దక్కనివారికి ఆ మొత్తం నగదు తిరిగి చెల్లించి వేలంలో పాల్గొనేవారు ఉదయం 10 గంటలకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్,రాయచోటి కు చేరుకోవాలని పేర్కొన్నారు.

ఫ్లోరెన్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యులు, నర్సులు

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సోమవారం వాల్మీకిపురం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మెడికల్ ఆఫీసర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు ఫ్లోరెన్స్ అందించిన సేవలను కొనియాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ గౌరవార్థం ఆమె పుట్టినరోజును అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతోందన్నారు. అనంతరం నర్సులకు స్వీట్లు పంపిణి చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సోని, హెడ్‌నర్స్ గోవిందమ్మ, నర్సులు సర్తాజ్, సరస్వతి, లావణ్య, సరోజ, శోభన, రత్నకుమారి, నూరాని, తదితరులు పాల్గొన్నారు.

'పల్లా' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ చేసిన నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ పల్లా శ్రీనివాసరావు టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా విశేష సేవలు అందిస్తున్నారని అన్నారు. టిడిపిలో కష్టపడ్డ ప్రతి కార్యకర్త ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని, దానికి నిదర్శనమే పల్లా శ్రీనివాసరావు అని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

అన్నదాత సుఖీభవకు ఇకెవైసి చేయించుకోండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఈ నెలాఖరు నుంచి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించనున్న అన్నదాత సుఖీభవ పథకంకు ఇకేవైసీ చేయించుకోవాలని వాల్మీకిపురం వ్యవసాయశాఖ ఎఒ హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద రూ.20వేలు రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్క రైతు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పోర్టల్ నందు నమోదు చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రానికి వచ్చే రైతులు తమ వెంట ఆధార్ కార్డు, పాస్‌పుస్తకం లేదా 1బి తీసుకొని రావాలని ఆమె సూచించారు.

షరతులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఆటవీ శాఖ అధికారి జగన్నాథ్ సింగ్

సమావేశంలో మాట్లాడుతున్న డిఎఫ్‌ఒ జగన్నాథ్ సింగ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

షరతులు ఉల్లంఘించి అక్రమంగా అటవీ ప్రాంతంలో సంచరిస్తే చర్యలు తప్పవని జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్‌సింగ్ పేర్కొన్నారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమ వారం ఆయన మాట్లాడుతూ తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చెందిన కొందరు యువత ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, యూట్యూబ్ ఛానల్‌లలో తలకోన అటవీ అందాలు చూపుతామని సామాజిక మాధ్యమాల ద్వారా కొందరు యువతకు ఎరవేసి అక్రమంగా తలకోన అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్‌కు పాల్పడిన సామాజిక మాధ్యమాల నిర్వహకులు సోమశేఖర్, ప్రదీప్, నిఖిత్‌పై కేసు నమోదు చేశామ న్నారు. ఈ నెల 10న అక్రమంగా అటవీ ప్రాంతంలో ప్రవేశించి శ్రీవెంకటేశ్వర నేషనల్ పార్క్, వన్యప్రాణి అభయారణ్యం, రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని తలకోన అటవీ ప్రాంతంలో ప్రవేశించి రాత్రి బస చేసేందుకు ప్రయత్నిస్తున్న ట్రెక్కింగ్‌కు పాల్పడుతున్నారనే రహస్య సమాచారం మేరకు తనతోపాటు కోడూరు ఉప విభాగం ఉప అటవీఅధికారి సుబ్బరాజ్, రాజంపేట రేంజ్ అటవీ క్షేత్రాధికారి దత్తాత్రేయ ప్రత్యేక బృందంతో నిఘా ఉంచినట్లు తెలిపారు. అక్రమంగా అడవిలోకి ప్రవేశించిన వారిని అదుపులోకి తీసుకున్నామని, వారిలో ఇద్దరు అమ్మాయిలతో పాటు పదిమంది అబ్బాయిలను, మద్యం బాటిళ్లు, క్యాంప్ సామగ్రితో పాటు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో కొందరు శ్రీనివాస్ వ్యూస్, తిరుపతి అడ్వెంచరస్ టెక్కర్స్, తిరుపతి అడ్వెంచర్ అడిక్ట్స్, ఐఎంసి వంటి పేర్లతో సామాజిక మాధ్యమాల ద్వారా యువతకు ఎరవేసి సాఫ్ట్ వేర్లను, యువతను ఆకర్షించి వారికి అటవీ అందాలు చూపుతామని ప్రలోభపెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా సోమశేఖర్ అనే వ్యక్తి బ్యాక్ ప్యాకర్స్ తిరుపతి అనే ఇన్‌స్టాగ్రామ్ నడుపుతూ యువతకు ఎరవేసి వారికి అటవీ అందాలు చూపేందుకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని అన్నారు. ఇతనికి ప్రదీప్, నవీన్, లిఖిత్, సూర్య అనే యువకులు సహకరించారని తెలిపారు. అందులో ఇద్దరిని అరెస్టు చేశామని, త్వరలోనే ప్రదీప్, నవీన్, లిఖిత్ లను కూడా అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. అడవులకు హాని కలిగించే ఇలాంటి సామాజిక మాధ్యమాలపై ఇటీవల నిఘా ఉంచడం జరిగిందని తెలిపారు. జాతీయ పార్కులు, అభయారణ్యాలు, రిజర్వు ఫారెస్టులలో అనధికారికంగా ప్రవేశించడం వివిధ అటవీ చట్టాల ప్రకారం శిక్షార్హంగా పరిగణించబడుతుందని తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని 27, 28, 35(8) ప్రకారం ఎటువంటి అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించడం నేరమని తెలిపారు. అటవీ చట్టాలను అతిక్రమిస్తే ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం 1967 లోని సెక్షన్ 20 ప్రకారం రిజర్వ్ ఫారెస్ట్‌లోకి అక్రమంగా ప్రవేశించడం, బస చేయడం వంటివి చేస్తే అరెస్టు లేదా జరిమానా విధిస్తామని చెప్పారు. కొన్ని సందర్భాలలో రెండు శిక్షలు విధించడం జరుగుతాయని వివరించారు. నేరపూరితమైన సామాజిక మాధ్యమాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల గుండాలకోన అటవీ ప్రాంతంలో ఏనుగుల దాడిలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా ఇద్దరు తీవ్రంగా గాయాల పాలయ్యారని తెలిపారు. శేషాచలం అడవులలో ఏనుగులతో పాటు చిరుతలు, ఎలుగుబంటిలు సంచరిస్తు న్నాయని, అక్రమంగా అడవుల్లోకి ప్రవేశించి ప్రాణాలు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. ఎవరైనా అనుమతులు లేకుండా అడవిలోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని కలికిరి శాఖ గ్రంథాలయ అధికారి విజయకుమార్ విద్యార్థులకు సూచించారు. కలికిరి స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకి పుస్తక పఠనం మీద ఆసక్తి కలిగించడానికి కథలు చదవడం, కథలు చెప్పడం, సృజనాత్మకతను పెంపొందించడానికి విద్యార్థులు స్థాయిని బట్టి వారికి ఈ సమ్మర్ క్యాంపులో ప్రత్యేక పాఠ్యప్రణాళికను సిద్ధం చేసి విద్యార్థులకు బోధిం చడం జరుగుతుందని ఆయన తెలిపారు. విద్యార్థులు విరామ సమయాన్ని సద్వినియోగ పరుచుకునేలాగా రిక్రియే ఏషన్ గేమ్స్, డ్రాయింగ్ నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జూన్ 6 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు అవసరమైన మెలుకవులు చదువులో జ్ఞాపకశక్తిని పెంపొందించడానికి యోగా తరగతులు నిర్వహి స్తున్నారని అన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ద్రౌపది వస్త్రాపహరణం ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న ద్రౌపది వస్త్రాపహరణం

ప్రజాశక్తి- కలకడ

ద్రౌపది వస్త్రాపహరణం ఘట్టం ప్రేక్షకులను అలరించినట్లు మహాభారత యజ్ఞం నిర్వాహకులు మాజీ ఎంపిపి శ్యామల కాంతారావు పేర్కొన్నారు. మండలంలోని కోన పంచాయతీ తిప్పిగారిపల్లెలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ద్రౌపది వస్త్రాభరణం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకున్నట్లు తెలిపారు. దుర్యోధనుడు ఆదేశానుసారం దుశ్శాసనుడు వస్త్రాభరణం భావించే నాటకాన్ని ప్రేక్షకులు ఆకట్టుకునేలా నిర్వహించినట్లు తెలిపారు. ద్రౌపదికి వస్త్రాభరణం చేసిన సమయంలో శ్రీకృష్ణుని తలు చుకుంటూ ఆలాపించిన పద్యాలు ప్రేక్షకులను అలరింపజేశాయని అన్నారు. ఈ మహాభారత యుద్ధంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేశారని తెలిపారు.

ఆలయ నూతన కమిటీ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్ చెరువు పంచాయతీ ఆసర్ల గంగమ్మ దేవాలయం నూతన కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథంను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రతిపాదించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి జిల్లా ఎండో మెంట్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. కమిటీ మెంబర్లు కాల్వపల్లి మల్రెడ్డి, దాదినేని రమణ, కృష్ణయ్య, లక్ష్మీదేవి, గంగాదేవి, బసిరెడ్డి, మల్లే శ్వరమ్మ, లక్కిరెడ్డి, ప్రేమరాణిలతో నూతన కమిటీని ఏర్పాటు చేయను న్నట్లు ఎండోమెంట్ అధికారి విశ్వనాథ్ పేర్కొన్నారు.

క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులతో సిబ్బంది

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పట్టణంలో జవివి, ఐద్వా ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిబిరంలో భాగంగా పిల్లలకి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ 6 వ తేదీ నుంచి మదనపల్లె లో ఐద్వా ఆధ్వర్యంలో బాలోత్సవం, వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజూ ఖోఖో, కబడ్డీ, డ్రాయింగ్ కథలు, జాతీయ నాయకుల చరిత్ర గురించి తెలియజేయడం జరుగుతోందన్నారు. ఆటలు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. స్థానిక జేపి హైస్కూల్ గ్రౌండ్లో రెడ్డి ప్రసన్న, నాగరాజా, భాగ్యమ్మ లు పిల్లలకి క్రికెట్ పోటీలు నిర్వహించి వారిలో నూతనోత్తేజం నింపినట్లు తెలిపారు. ప్రతిరోజు పిల్లలకు స్నాక్స్, బిస్కెట్స్, మజ్జిగ ను సిఐటియు కోశాధికారి హరిశర్మ, అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ రాజేశ్వరి అందిస్తున్నారని తెలిపారు.

కబ్జా భూమిని కాపాడి న్యాయం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుత్తకు ఇచ్చిన తమ భూమిని కబ్జా చేయడంతో పాటు అక్కడే అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని మండలంలోని చిప్పిలికి చెందిన ఎం. మునివెంకటప్ప సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు మండలం బండ్లపై గ్రామంలో 3.83 ఎకరాల భూమి వుందని, 1972లో తన తండ్రి ఎం.కృష్ణప్పకు ప్రభుత్వం డికెటి పట్టా ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తన తండ్రి తమ్ముడు ఎం.సుబ్బరాయప్ప కుమారుడు ఎం.నరేంద్రకు గుత్తకు ఇచ్చారని అన్నారు. 3.83ఎకరాల భూమిని నరేంద్ర తన పేరున అక్రమంగా మార్చుకున్నాడని, దీనిపై ప్రశ్నిస్తే తమను ఆ భూమిలోకి రాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. కలెక్టర్ విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా ముత్యాలమ్మ తిరుణాల

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసవారిపల్లి పంచాయతీ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి తిరుణాల ఉత్సవానికి హాజరయ్యారు పూజారి రెడ్డప్ప అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్ర సాదాలను అందించారు. ఎమ్మెల్యే వెంట మండల వైసిపి కన్వీనర్ చౌడేశ్వర్, స్థానిక

ముత్యాలమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

తాకట్టు పెట్టిన బంగారు నగలపై అదనపు ఛార్జీలు వసూలు

- ఇండియన్ బ్యాంకు సిబ్బందిపై ఖాతాదారుల ఆగ్రహం
- రూ.10 వేలకు రూ.50 అదనంగా వసూలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల కేంద్రం బి.కొత్తకోటలోని ఇండియన్ బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకునేందుకు అదనపు చార్జీలు వసూలు చేస్తుండడంతో ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులో బంగారు తాకట్టు పెట్టే సమయంలో నాణ్యత పరిశీలించేందుకు కార్డుకు రూ.250 తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తాకట్టు పెట్టిన బంగారు నగలును అసలు, వడ్డీ మొత్తం నగదు చెల్లించి విడిపించుకున్న తర్వాత నగులు చేతికి ఇవ్వడానికి రూ.10 వేలకు రూ.50లు చొప్పున అదనపు ఛార్జీలుచేస్తున్నారని ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ బ్యాంకులో లేని విధంగా తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకోవడానికి ఇండియన్ బ్యాంకులో ఎందుకు అదనంగా వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారం అంతా బ్యాంకులోనే జరుగుతున్నప్పటికీ బ్యాంకు అధికారులు చూసిచూడన్నట్లు వ్యవహరించడంపై ఖాతా దారులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి రూ.10వేలకు రూ.50లు ఎందుకు అందనంగా

ఇండియన్ బ్యాంక్

తీసుకుంటున్నారో విచారించాలని ఖాతాదారులు కోరుతు న్నారు. ఈ విషయంపై బ్యాంకు మేనేజరుని వివరణ కోరగా విడిపించుకునే సమయంలో బంగారు ఇచ్చేందుకు రూ.10 వేలకు రూ.50 తీసుకుంటున్న విషయం తనకు తెలియదని అన్నారు. అలా తీసుకున్న విషయం తమ దృష్టికి ఖాతాదార్లు తీసుకువస్తే స్టోరేజ్ ఉన్న రెండు నెలలు సిసి పుటేజ్ పరిశీలించి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. బంగారు విడిపించుకునే సమయంలో అసలు, వడ్డీ చెల్లిస్తే చాలని బంగారు ఇచ్చేందుకు అదనపు చెల్లిం పులు అవసరం లేదని మేనేజర్ స్పష్టం చేశారు.

కాలుష్య రహిత వ్యవసాయ పద్ధతులు పాటించాలి

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న కెవికె కో-ఆర్డినేటర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

రైతులు కాలుష్య రహిత వ్యవసాయ పద్ధతులను పాటించాలని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల పేర్కొన్నారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో మహానంది వ్యవసాయ కళాశాల నాలుగవ సంవత్సరం అగ్రికల్చర్ బిఎస్‌సి విద్యార్థులు మూడు నెలల శిక్షణ కార్యక్రమానికి గాను కలికిరి, పీలేరు మండలాల్లోని మర్రికుంటపల్లి, బోడుమల్లువారిపల్లి, మిట్టపల్లి గ్రామాల్లో ఫిబ్రవరి నుంచి వ్యవసాయం, అనుబంధ రంగాలపై అభ్యసించి అవగాహన పొందారు. సోమవారం విద్యార్థులు మరికుంటపల్లిలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవికె కో-ఆర్టినేటర్ కెవికె నుంచి రైతులకు అందుతున్న తోడ్పాడును తెలిపారు. చీడపీడల నివారణకు పురుగుమందుల వాడకాన్ని తగ్గించి కాలుష్య రహిత వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. జీవ శిలీంద్ర నాశినులైన ట్రైకోడెర్మా, సూడోమోనాస్ ను కెవికె వారి సలహా మేరకు జిల్లాలోని టమాటా, వేరుశనగ రైతులు ఎక్కువగా వాడడం వలన వేరుకుళ్ళులను అరికట్టుతున్నారని తెలిపారు. కొబ్బరిలో సర్పిలాకార తెల్లదోమ నివారణకు వేప సంబందిత మందులను నెలకు ఒకసారి పిచికారి చేస్తూ, అంబాజీపేట పరిశో ధన స్థానం అభివృద్ధి చేసిన మిత్ర పురుగులను విడుదల చేయడం వలన నిర్మూలించవచ్చు అని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మమత మాట్లాడుతూ రైతులు రసాయన పురుగు మందులు, ఎరువులు ఎక్కువ వాడడం వలన భూసారం తగ్గుతుందని అన్నారు. దీనిని అరికట్టడానికి వారికి ఉన్న పొలంలో కొంత భాగంలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించడం శ్రేయస్కరమని అన్నారు. సేద్య విభాగం శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి జిల్లాకు అనువైన వరి, వేరుశనగ, ఆముదం, కంది, అనప, అలసంద, ఉలవ మొదలగు రకాల గురించి వివరించారు. ఉద్యాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు టమాటా రైతులు మార్కెట్ ఒడిదుడుకలను ఎదుర్కోవడానికి టమాటా విలువ ఆధారిత ఉత్పత్తులు చేయడంపై మొగ్గు చూపాలని చెప్పారు. అవకాడో, కీర దోస లాంటి పంటలను సాగు చేయాలని ప్రోత్సహించారు. సస్యరక్షణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ వై. పీరు సాహెబ్ వేరుశనగలో విత్తన శుద్ధి పద్ధతులను పాటించడం వలన వేరు కుళ్ళు ఉధృతిని తగ్గించవచ్చని తెలిపారు. మామిడిలో ఫ్రూట్ కవర్స్ వల్ల చాలా ఉపయోగమని తెలిపారు. పశువైద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె నవీన పశుపోషణలో సమతుల్య మేత ప్రాధాన్యత గురించి, అనువైన ప్రశుగ్రాస రకాల గురించి వివరించారు. ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శాంతకుమారి గారు మాట్లా డుతూ మార్కెట్ డిమాండ్ ఆధారంగా పంటలను సాగర సాగు చేసి నట్లయితే రైతులకు లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో 48 మంది రైతులు, ఆర్‌ఎస్‌కె సిబ్బంది, కెవికె సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరటి తోటలను ప్రోత్సహిద్దాం :ఎఒ

ప్రజాశక్తి-రామాపురం

ఇంటి ఆవరణంలో పెరటి తోటలను ప్రోత్సహించి ఆర్గానిక్ కూరగాయలు, ఆకుకూరలు, తీగ కూరగాయలను పండిద్దామని మండల వ్యవసాయ అధికారి నాగమణి మండల ప్రజలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం సమీపంలో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, తీగ కూరగాయలు విక్రయాలు జరుగుతున్నాయని వీటికి మంచి డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. రసాయనిక వ్యవసాయంలో పండించే ఉత్పత్తుల వాడకం వల్ల బిపి, షుగర్, తలనొప్పి, గ్యాస్ ట్రబుల్, గుండెపోటు వంటి సమస్యలు వస్తుంటాయని ప్రకృతి వ్యవసాయ మండల మాస్టర్ ట్రైనర్ మధుకర్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులను తినడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రవీంద్రగౌడ్ చెప్పారు. ఒక రైతు ఎ గ్రేడ్ మోడల్స్ ఎటిఎం రకాలను పండించి మంచి ఆదాయం పొందుకోవ చ్చని అన్నారు. రసాయనాలు తగ్గించి

ఆర్గానిక్ కూరగాయలను విక్రయిస్తున్న మహిళలు

సమతుల్యమైన ఆహారం తీసుకోవచ్చని తెలిపారు. ఇంటి ఆవరణంలోనే ఇష్టమైన కూరగాయాలను పండించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో యాంకర్ వెంకటరామిరెడ్డి, సుధాకర్, హరి, రెడ్డమ్మ , ఐసిఆర్‌పి, రైతులు పాల్గొన్నారు.

వేడుకగా హరిహరాదుల కల్యాణం



పార్వతీ పరమేశ్వరులు, లక్ష్మీనారాయణలకు జరుగుతున్న కల్యాణం

ప్రజాశక్తి-వీరబల్లి

వీరబల్లి హరిహరాదుల దేవాలయంలో సోమవారం శివపార్వతులు, లక్ష్మీనారాయణ స్వాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. తిరుణాల మహోత్సవంలో భాగంగా శివాలయ మహామండపంలో పార్వతీ, పరమేశ్వరులకు, లక్ష్మీనారాయణలకు పట్టు వస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలు, వివిధ రకాల పూలమాలలతో దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేకసేవలో తీర్చిదిద్దారు.పరమేశ్వరుడికి యజ్ఞోపవీతధారణ పర్వాలు జరిపిన అర్చకులు జీలకర్రబెల్లం, కన్యాదానతంతు నిర్వహించారు. వేదపండితులు నిర్ణయించిన సుము హూర్తంలో అమ్మవారి మెడలో పరమేశ్వరుడు, నారాయణుడు మాంగల్యధారణ చేశారు. స్వాములవారికి ఉదయం సుప్రభాతం, గణపతి పూజ, అంకురార్పణం, కళశపూజ, దేవత మూర్తులకు అభిషేకాలు, అర్చనలు, ధ్వజ రోహణం, గణపతి హెూమం, రుద్రహోమం, శ్రీ లక్ష్మీ నారాయణ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు భోజన వసతి కల్పించారు. గ్రామం నుంచి డప్పువాయిద్యాల మధ్యన ఊరేగింపుగా వచ్చి ఆలయంలో శివపార్వతులకు, లక్ష్మీనారాయణ లకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వేద పండితులు, గ్రామపెద్దల, ధర్మకర్తల, వేదమంత్రాల సమక్షంలో శివపార్వతుల, లక్ష్మీనారాయణ కల్యాణం వైభవంగా జరిగింది. రాత్రి ఉమామహేశ్వర ఈవెంట్స్ ఒంగోలు వారిచే శివపార్వతుల ప్రదర్శనలతో గ్రామం అంతా శ్రీ హరిహరాదుల రథోత్సవం నిర్వహించారు. రాత్రి సమయంలో అన్నదాన కార్యక్రమం కనిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మోహన్ నాయక్ పోలీస్ సిబ్బంది, పరివేక్షించారు.

పట్టా భూముల్లో ప్రభుత్వ రోడ్డు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని పాటూరు గ్రామపంచాయతీ పరిధిలోని 953 సర్వే నెంబర్ పట్టా భూమిలో యజమానుల అనుమతి లేకుండా సిమెంట్ రోడ్డు వేశారని ఆ సర్వే నెంబర్ లోని ఒక యజమాని అయిన షేక్ అన్సర్‌బాషా సోమవారం స్థానిక తహశీల్దార్ పుల్లారెడ్డి, ఎంపిడిఒ రాధా కృష్ణంరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అన్సర్‌బాషా మాట్లాడుతూ ఈ రోడ్డులో ఎటువంటి నివాస గృహాలు లేవని, కేవలం వ్యవసాయ భూములు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఇక్కడ రోడ్డు వేయడం వల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని అన్నారు. రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి రోడ్ల కోసం నిధులు మంజూరు చేయగా కొంతమంది తమ స్వప్రయోజనాల కోసం కాంట్రాక్టర్, అధికారులు కుమ్మక్కై నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. మా భూములలో మా అనుమతి లేకుండా వేసిన రోడ్డును తొలగించాలని ఆయన కోరారు. మాకు తెలియకుండా మా భూములలో రోడ్డు వేసిన వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న షేక్ అన్సర్‌బాషా

20లోగా 'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

మాట్లాడుతున్న ఎఒ రమాదేవి

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాలకు అర్హులైన రైతులు ఈనెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని పీలేరు వ్యవసాయ శాఖ అధికారి రమాదేవి తెలిపారు. సోమవారం ఆమె పీలేరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు అందించే రూ.20వేలు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆర్థిక సహాయాన్ని మూడు విడతలుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనుంద న్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.14వేలు, కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ పథకం ద్వారా రూ.6,000 అందించనుందని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెపారు. రైతులు తమ ఆధార్ నంబరు, భూమి వివరాలు, వెబ్‌ల్యాండ్ సమాచారం సరిగ్గా నిర్ధారించుకుని, ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ పథకాలకు భూములపై హక్కులు కలిగిన రైతులు మాత్రమే అర్హులని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసేవారు, స్థానిక సంస్థల శాశ్వత ఉద్యోగులు, నెలకు రూ.10వేలకు మించిన పెన్షన్ పొందేవారు, ఆదాయ పన్ను చెల్లించే వారు, రాజ్యాంగబద్ధ పదవులు కలిగిన ఎమ్మెల్యేలు, ఎంపీలు వంటి వారు ఈ పథకాలకు అనర్హులని తెలిపారు.

ఆటో బోల్తా పడటంతో నేలపాలైన టమోటాలు

టమోటా ఆటో బోల్తా : రైతుకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని అరవీడు పంచాయతీ నడింపల్లికి చెందిన రైతు రమణారెడ్డి సాగు చేసుకున్న టమోటాను గుర్రంకొండ మార్కెట్‌కు తరలిస్తుండగా సోమవారం గుడిచానుచెరువు సమీపంలో అటువైపున వస్తు న్న కారును తప్పించబోయి బోల్తా పడింది. ఆటో నిండా ఉన్న టమోటా కిరిటాలన్నీ నేలపాలైపోయాయి. రేటు లేక టమోటాతో నష్టపోయామని, కాస్తో కూస్తో రెండు రూకలు చేతికి వస్తాయను కున్న టమోటాలు నేలపాలై పోయాయని రైతు రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని నూలివీడు బస్టాండ్ నడిబొడ్డులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణం ఆక్రమణకు గురవుతుందని, చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ ప్రజలు ఎంపిడిఒ, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ఆవరణమంతా దుకాణాలు, ఆటోలు, మాంసం దుకాణాలతో నిండిపోయిందన్నారు. ఆక్రమ ణలతో పాఠశాల కనిపించడం లేదని, పాఠశాలకు పోవాలన్నా దారి కూడా సరిగా లేదన్నారు. గతంలో రోడ్డు ఆక్రమణపై సర్వే చేసి మార్కింగ్ కూడా వేశారని అన్నారు. ఆక్రమణ తొలగించకపోవడంతో గ్రామ ప్రజలు తహ శీల్దార్ జె.భాగ్యలత, ఎంపిడిఒ సిఎ.జవహర్‌బాబును కలిసి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మంగళవారం పంచాయతీ కార్యదర్శి, ఇఒపిఆర్‌డి పాఠశాల స్థలాన్ని సర్వే చేస్తారని తెలిపారు. పాఠశాల స్థలం ఆక్రమణకు గురైతే పోలీసుల సహాయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా గౌతమ బుద్ధ పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీలో బహుజన సమాజ్ వాజ్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి వెంకటరమణ, రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు పెద్దివీటి రామ్మోహన్ ఆధ్వర్యంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌతమ బుద్ధ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విశ్వ మానవాళికి ప్రేమ తత్వాన్ని, అహింసను, బోధించిన గౌతమ బుద్ధుని బోధనలు నేటికీ సదా ఆచరణీయం అన్నారు. ఎన్నో ఏళ్ల క్రితమే శాంతియుత సహజీవన సూత్రాలను కార్యచరణ విశ్వ మానవాళికి అందించిన గౌతమ బుద్ధుడు సంచరించిన నేలమీద జీవిస్తుండడం ప్రతి భారతీయుడు గర్వపడాల్సిన విషయమని అన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన కెకె చౌదరి

ప్రజాశక్తి-చిట్వేలి

నారా లోకేష్‌తో కెకె చౌదరి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి చైర్మన్ కెకె చౌదరి సోమవారం ఉండవల్లిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో టిడిపి బలోపేతం గురించి, రాష్ట్రంలో గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి గురించి సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. అనంతరం లోకేష్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఉర్దూ డిఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి : రూట

ప్రజాశక్తి -కడప అర్బన్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప, కృష్ణ, గుంటూరు, బాపట్ల, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఉర్దూ డిఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఉర్దూ రేంజ్) పోస్టులు అర్హులైన వారితో భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాఖ్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉర్దూ ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉర్దూ డిఐలు ఎంతో దోహదపడతారని తెలిపారు. ఉర్దూ డిఐలు లేని కారణంగా గత దశాబ్ద కాలంగా ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో నష్టపోయాయరని పేర్కొన్నారు. ఉర్దూ డిఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట : మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో వైశాఖ మాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా సోమవారం మొలకల పౌర్ణమి ఆంజనేయ స్వామి తిరుణాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు, ఎద్దుల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఎపిఐఐసి రాష్ట్ర మాజీ డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి ఉదయం అల్పాహార కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం బండలాగుడు పోటీలను ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు గ్రామ పెద్దలు బహుమతులను అందజేశారు.

పురాతన నాణేలు ప్రదర్శన

ప్రజాశక్తి- కడప అర్బన్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం లో భాగంగా సోమవారం పురాతన నాణేల ప్రదర్శన నిర్వహి ంచారు. రాయలసీమ నాణేల సేకరణ సంఘం వారి ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యవర్గ సభ్యుడు యస్. రంగనాథ్ పర్యవేక్షణలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. అమీరుద్దీన్ ఆహ్వానం మేరకు ప్రపంచ దేశాల నాణేలు, నోట్లు, వివిధ రాజుల కాలం నాటి పురాతణ నాణేలు ప్రదర్శించారు. ప్రజలు, విద్యార్థుల విజ్ఞానం కోసం క్రీస్తు పూర్వం నుంచి క్రీస్తు శకం వరకు వినియోగంలోని నాణేములతో పాటు ఇండో గ్రీకులు, ఇండో ససానియన్, కోటి లింగాల నాణేలు, శాతవా హనులు, ఇక్ష్వాకులు,సిబాకరాజులు, హిరాణ్యక, ఆనంద గోత్రికులు, గుప్తులు, విష్ణుకుండిణులు, మగదరాజులు, పల్లవులు, చోళులు, ఉజ్జయిని రాజులు. జూనాఘడ్, విజయనగర సామ్రాజ్య నాణెములు, హోయసాలలు, అక్బర్, అల్లాఉద్దీన్, ఖిల్జి, షాజహాన్, ఔరంగజేబు, టిప్పు సుల్తాన్, మైసూర్ రాజుల నాణేలు ప్రదర్శించారు. రెండవ ప్రపంచ యుద్ధకాలం నాటి నోట్లు, వివిధ దేశాలలో ఉన్నటివంటి ప్లాస్టిక్ నోట్లను ప్రదర్శనలో విద్యార్థునులు వీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రెరియన్ ఇ.పవన్ కుమార్, అసిస్టెంట్ లైబ్రెరియన్ నాదెండ్ల బాబ్జి, జేమ్స్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి- రామసముద్రం

గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం మండలంలో కలకలం రేపింది. మండలంలోని ఎలకపల్లి సమీపంలో ఉన్న గుట్ట ప్రాంతంలో 35 సంవత్సరాలు పైబడిన గుర్తు తెలియని మహిళను హత్యచేసి, పెట్రోల్ పోసి పాక్షికంగా కాల్చినట్లు మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర తెలిపారు. సంఘటనా స్థలానికి ఫోరెనిక్స్ చిత్తూరు నుండి క్లూస్ టీం వచ్చి హత్య స్థలంలో వివరాలు సేకరించారు. త్వరలోనే హత్య కేసును చేదించి నిందితులను పట్టుకుంటామని డిఎస్‌పి తెలిపారు. డిఎస్‌పి వెంట మదనపల్లి రూరల్ సిఐ సత్యనారాయణ ఇన్‌ఛార్జి ఎస్ఐ తిప్పేస్వామి పాల్గొన్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోను స్థానిక మండల పరిధిలో హత్యకు గురైన మహిళ వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.